క్లుప్తంగా

వృద్ధాశ్రమంలో అన్నదానం



అన్నదానం చేస్తున్న దాతలు

మునగాల : మండలంలోని ముకుందాపురం గ్రామపంచాయతీ శివారులో గల ఇందిర అనాథ వృద్ధాశ్రమంలో వృద్ధులు, మానసిక వికలాంగులకు మంగళవారం హుజూర్‌నగర్ పట్టణానికి చెందిన పెన్న పెద్దక్క జ్ఞాపకార్థం మేనల్లుడు వేల్పుల మోహన్‌రావు -లక్ష్మి దంపతులు అన్నదానం నిర్వహించారు. అన్నదానం చేసేందుకు ముందుకు వచ్చిన దాతలను ఆశ్రమ నిర్వాహకురాలు నాగిరెడ్డి విజయమ్మ ఈ సందర్భంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ సిబ్బంది వాచేపల్లి భవ్య తదితరులు పాల్గొన్నారు.

బూరుగడ్డ ఆలయంలో క్షేత్రపాలకుడికి ఆకుపూజ



ఆకుపూజలో పాల్గొన్న భక్తులు

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని బూరుగడ్డలో ఉన్న శ్రీఆదివరాహ లక్ష్మీనర్సింహ వేణుగోపాలస్వామి ఆలయంలో ఆంజనేయస్వామికి మంగళవారం ఘనంగా ఆకుపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం సుప్రభాతసేవ, ఆరాధన, మంగళాశాసనం, ఆంజనేయస్వామికి పంచామృతాలు, 108 తమలపాకులతో అభిషేకం, ఆకుపూజ, గంధ సింధూరం, మన్యసూక్త పారాయణం, శ్రీరామ, ఆంజనేయ అష్టోత్తర శతనామావళి, అలంకరణ, తీర్థప్రసాద వితరణ తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు ముడుంబై మనోహరాచార్యులు, హరీష్‌కుమార్‌చార్యులు, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

ఈటల రాజేందర్ గెలుపుపై హర్షం

మునగాల : బీజేపీ రాష్ట్ర నాయకుడు, ముదిరాజ్ సంఘం రాష్ట్ర నాయకుడు ఈటల రాజేందర్ మల్కాజ్‌గిరి పార్లమెంటు నియోజకవర్గం నుంచి గెలపొందడం పట్ల మంగళవారం ముదిరాజ్ సంఘం సూర్యాపేట జిల్లా కమిటీ సభ్యుడు మామిడి చినరామయ్య హర్షం వ్యక్తం చేశారు. రానున్న కాలంలో రాజేందర్ కేంద్రంలో మరిన్ని ఉన్నత పదవులు అలంకరించాలని ఆకాంక్షించారు.

విద్యుదాఘాతంతో దున్నపోతు మృతి

చివ్వెంల : మండల పరిధిలోని రోళ్లబండం తండా గ్రామ శివారులో మంగళవారం విద్యుదాఘాతంతో దున్నపోతు మృతిచెందింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వట్టి ఖమ్మంపహాడ్ గ్రామానికి చెందిన వీరబోయిన మల్లయ్య రోళ్ల బండ తండా గ్రామ శివారులో దున్నపోతును మేపుతున్నాడు. అయితే వ్యవసాయ మోటార్ కోసం అమర్చిన విద్యుత్ వైర్ అక్కడే ఉన్న ఫెన్సింగ్‌పై పడడంతో ఫెన్సింగ్ గుండా విద్యుత్ సరఫరా అయ్యింది. ఈ క్రమంలో దున్నపోతు మేత మేస్తూ వెళ్లి ఫెన్సింగ్‌కు తగిలింది. దీంతో విద్యుదాఘాతం ఏర్పడి అక్కడికక్కడే మృతి చెందింది.

మూడు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల చోరీ

త్రిపురారం : మండలంలోని నీలాయిగూడెం గ్రామ పంచాయతీ పరిధిలోని ఘంటారావు క్యాంపులో ఆదివారం రాత్రి మూడు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను గుర్తు తెలియని దుండగులు పగలగొట్టి అందులోని ఆయిల్, కాపర్ వైర్‌ను దొంగిలించారు. సోమవారం ఉదయం స్థానికులు గుర్తించి విద్యుత్ అధికారులకు సమాచారం అందించారు. సుమారు రూ. 3 లక్షలు నష్టం జరిగినట్లు అధికారులు గుర్తించారు. ఆరు నెలలుగా పలు గ్రామాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు చోరీకి గురవుతుండడంతో విద్యుత్ శాఖకు తీవ్రంగా నష్టం జరుగుతోంది. పోలీసులు రాత్రి సమయంలో నిఘా ఉంచాలని మండల ప్రజలు కోరుతున్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం



ఆర్థికసాయం అందజేస్తున్న నాయకులు

అర్వపల్లి : మండల పరిధిలోని అడివెంల గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు పేరెల్లి అంజయ్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. దీంతో అతడి కుటుంబానికి మంగళవారం నియోజకవర్గ కాంగ్రెస్ నాయకుడు బీరవోలు విక్రమ్‌రెడ్డి రూ.12వేల ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామశాఖ అధ్యక్షుడు పిట్టల సైదులు, బోయపల్లి రవి, ఆవుల విక్రమ్, మేడబోయిన ప్రవీణ్, పీఏసీఎస్ సీఈఓ మేడబోయిన రామస్వామి, సైదులు, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

పట్టు నిలుపుకున్న కాంగ్రెస్



కాపుగల్లులో కాంగ్రెస్ శ్రేణుల సంబరాలు

- కోదాడ నియోజకవర్గంలో రఘువీర్‌రెడ్డికి 97,338 ఓట్ల మెజార్టీ
- పుంజుకున్న బీజేపీ, పూర్తిగా డీలాపడ్డ బీఆర్‌ఎస్

కోదాడ నియోజకవర్గంలో ఎంపీ అభ్యర్థులు రౌండ్‌ల వారీగా సాధించిన ఓట్ల వివరాలు..

రౌండ్	కాంగ్రెస్	బీఆర్‌ఎస్	బీజేపీ	నోటా
1	6218	1321	1202	35
2	5238	1537	508	29
3	5193	1869	701	27
4	5555	2220	752	36
5	5991	2012	699	41
6	5466	1408	836	58
7	6413	1531	987	43
8	6284	1490	879	31
9	6502	1175	1314	50
10	5712	1152	1415	33
11	5130	1225	900	29
12	6199	1681	1108	39
13	5381	777	2001	75
14	4820	610	1100	77
15	6282	654	1296	72
16	6469	698	1901	81
17	6364	951	1400	47
18	6564	1785	802	39
19	6098	924	804	44
20	5928	1351	763	51
21	6858	1538	924	46
22	807	225	86	04
మొత్తం	1,25,472	28,134	22,378	987

కోదాడ : నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ మరోసారి తన పట్టు నిలుపుకుంది. డిసెంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో సాధించిన మెజార్టీని ఈ పార్లమెంట్ ఎన్నికల్లో అధిగమించింది. కాంగ్రెస్ నల్లగొండ పార్లమెంట్ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డికి నియోజకవర్గంలో ఏకంగా 97,338 ఓట్ల మెజార్టీ రావడం గమనించదగ్గ విషయం. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ కోదాడ అభ్యర్థి నలమాద పద్మావతిరెడ్డికి 1,25,783 ఓట్లు రాగా.. ఆమె మెజార్టీ 58,172గా నమోదైంది. ఇక పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థికి కోదాడ నియోజకవర్గంలో 1,25,472 ఓట్లు వచ్చాయి. అంటే ఎంపీ అభ్యర్థికి పద్మావతి కన్నా 311 ఓట్లు తక్కువగా వచ్చాయి. కానీ ఆయన మెజార్టీ మాత్రం 97,338గా నమోదైంది. దీనికి కారణం బీఆర్‌ఎస్ అభ్యర్థికి ఇక్కడ తక్కువ ఓట్లు రావడమే. గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి బొల్లం మల్లయ్యయాదవ్‌కు 67,611 ఓట్లు రాగా పార్లమెంట్ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డికి కేవలం 28,134 ఓట్లు మాత్రమే వచ్చాయి. మల్లయ్య కన్నా ఈయనకు 39,477 ఓట్లు తక్కువగా వచ్చాయి. బీఆర్‌ఎస్ ఓట్లు కాంగ్రెస్ పార్టీకి క్రాస్ కావడంతో రఘువీర్‌రెడ్డి మెజార్టీ భారీగా పెరిగినట్లు తెలుస్తోంది. అసెంబ్లీ ఎన్నికల్లో పొత్తులో భాగంగా బీజేపీ ఈ సీటును జనసేనకు కేటాయించింది. జనసేన అభ్యర్థి మేకల సతీష్‌రెడ్డికి కేవలం 2151 ఓట్లు మాత్రమే వచ్చాయి. కానీ పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డికి కోదాడ నియోజకవర్గంలో మునుపెన్నడూ లేనివిధంగా ఏకంగా 22,378 ఓట్లు రావడం గమనించదగ్గ విషయం. ఇక్కడ కూడా బీఆర్‌ఎస్ ఓట్లు బీజేపీకి క్రాస్ అయినట్లు తెలుస్తోంది.

'హుజూర్‌నగర్'లో అత్యధిక మెజార్టీ

- కాంగ్రెస్‌కు 1.05 లక్షల ఓట్ల లీడ్
- ద్వితీయ, తృతీయ స్థానాల్లో బీఆర్‌ఎస్, బీజేపీ

హుజూర్‌నగర్ : పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నల్లగొండ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డి హుజూర్‌నగర్ నియోజకవర్గంలో అత్యధిక మెజార్టీ సాధించారు. నల్లగొండ పార్లమెంటు పరిధిలో ఏడు నియోజకవర్గాలు ఉండగా హుజూర్‌నగర్ నియోజకవర్గంలో కాంగ్రెస్‌కు 1.05 లక్షల పైచిలుకు మెజార్టీ వచ్చింది. ఓట్ల లెక్కింపులో ఈ నియోజకవర్గం ప్రతి రౌండ్‌లోనూ ఆధిక్యం ప్రదర్శించింది. మాజీ ఎమ్మెల్యే, నల్లగొండ బీజేపీ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి గ్రామం మఠంపల్లి మండలం గుండ్లపల్లిలో కాంగ్రెస్ పార్టీకి 272 ఓట్ల మెజార్టీ వచ్చింది. హుజూర్‌నగర్ పట్టణంలో కూడా కాంగ్రెస్ అన్ని బూత్‌లలో ఆధిక్యాన్ని ప్రదర్శించి 12,380 మెజార్టీ సాధించింది. నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డికి 1,33,200 ఓట్లు రాగా బీఆర్‌ఎస్ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డికి 27,781 ఓట్లు, బీజేపీ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డికి 21,777 ఓట్లు వచ్చాయి. నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ 1,05,419 ఓట్ల మెజార్టీ సాధించింది. జిల్లాలో హుజూర్‌నగర్ నియోజకవర్గంలోనే అత్యధిక మెజార్టీ వచ్చింది. దీంతో కాంగ్రెస్ శ్రేణులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

హుజూర్‌నగర్ నియోజకవర్గంలో రౌండ్ల వారీగా వివరాలు..

రౌండ్	కాంగ్రెస్	బీఆర్‌ఎస్	బీజేపీ	నోటా
1	6218	1321	1202	51
2	4826	1131	1374	61
3	5113	1019	1194	53
4	6463	1455	607	34
5	5897	1279	863	37
6	6353	903	1288	69
7	6692	1033	947	24
8	6436	1930	849	46
9	6185	1626	792	50
10	5585	920	854	54
11	6276	841	935	41
12	5658	1329	928	53
13	5478	1704	803	79
14	6138	1098	758	19
15	6849	1015	1461	73
16	6786	708	1330	95
17	6490	1068	826	59
18	6051	1358	956	68
19	5811	1368	1135	41
20	5822	1417	1104	43
21	5770	1538	714	53
22	6303	1720	757	49
మొత్తం	1,33,200	27,781	21,777	1,152

ఊరచెరువు పూడికతీత పనులు ప్రారంభం

- డెక్కన్ సిమెంట్ పరిశ్రమ ఆధ్వర్యంలో నిర్వహణ



జాన్‌పహాడ్ చెరువులో పూడికతీత పనులు చేయిస్తున్న డెక్కన్ పరిశ్రమ యాజమాన్యం

పాలకవీడు : సమస్త మానవాళి, జీవరాసుల మనుగడకు నీరే ఆధారమని డెక్కన్ సిమెంట్ పరిశ్రమ వైస్ ప్రెసిడెంట్ ఎస్.శ్రీనివాసరాజు అన్నారు. పరిశ్రమ సామాజిక బాధ్యతలో భాగంగా మంగళవారం పాలకవీడు మండల పరిధిలోని జాన్‌పహాడ్ గ్రామంలోని ఊర చెరువులో పూడికతీత పనులను ప్రారంభించి మాట్లాడారు. భూగర్భ జలాలను పెంపొందించడం కోసం ప్రతిఒక్కరూ కృషిచేయాలని అన్నారు. చెరువులు పూడికతీతతో భూగర్భ జలాలు పెరుగుతాయని దీంతో రైతులకు సాగునీటి లభ్యత పెరుగుతుందని తెలిపారు. చెరువు మట్టితో వ్యవసాయ భూములు సారవంతం అవుతాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా రైతులు, గ్రామస్తులు పరిశ్రమ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు.

తెలంగాణలో పుంజుకున్న బీజేపీ



కోదాడలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న అంజియాదవ్

కోదాడరూరల్ : పార్లమెంటు ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ గణనీయంగా పుంజుకుందని బీజేపీ రాష్ట్ర నాయకుడు మల్లెబోయిన అంజియాదవ్ అన్నారు. మంగళవారం కోదాడలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నెహ్రూ రికార్డును బద్దలు కొట్టి మూడోసారి ప్రధాని అయిన ఘనత నరేంద్రమోదీకే దక్కిందన్నారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీకి ధీటుగా బీజేపీ ఎంపీ స్థానాలు సాధించిందని తెలిపారు. రాష్ట్రంలో గత పాలకులు, ప్రస్తుత పాలకుల మాటలను ప్రజలు ఇక నమ్మే స్థితిలో లేక బీజేపీకి మద్దతు ఇచ్చారని పేర్కొన్నారు. 2028లో తెలంగాణలో బీజేపీ అధికారంలో రావడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కోదాడ నియోజకవర్గంలో గత ఎన్నికలతో పోల్చుకుంటే బీజేపీకి ఓటు బ్యాంకు గ్రామ స్థాయి నుంచి గణనీయంగా పెరిగిందన్నారు.

కోదాడలో భారీ ర్యాలీ..

తెలంగాణతో పాటు దేశవ్యాప్తంగా బీజేపీ విజయపథంలో పరుగెత్తుతుండడంతో కోదాడలోని రంగా థియేటర్ చౌరస్తాలో బీజేపీ నాయకులు బాణసంచా కాల్చి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు బాణాల సాయిశర్మ, బుర్ర నవీన్, రౌతు కళ్యాణ్, బి.లచ్చు నాయిక్, చింతకుంట్ల నాగేశ్వరరావు, రఘు, సతీష్, రాజశేఖర్, వెంకన్న, నవీన్, లింగమ్మ, యాకోబు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి



ప్రశాంతి మృతదేహం

హుజూర్‌నగర్ రూరల్ : ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఓ వివాహిత మృతి చెందింది. ఈ ఘటన హుజూర్‌నగర్ పట్టణంలో మంగళవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ ముత్తయ్య తెలిపిన వివరాల ప్రకారం .. మండలంలోని అమరవరం గ్రామానికి చెందిన గుజ్జుల ప్రశాంతి(32) గుజ్జుల సైదిరెడ్డిని వివాహం చేసుకుంది. వారికి ఒక కుమారుడు ఉన్నాడు. కొంత కాలంగా భార్యభర్తల మధ్య గొడవల కారణంగా నాలుగు సంవత్సరాలుగా ప్రశాంతి భర్తను వదిలేసి హుజూర్‌నగర్ పట్టణంలో ఓ ప్రైవేట్ ఉద్యోగం చేస్తూ తన కుమారుడితో కలిసి ఉంటుంది. ప్రశాంతి నర్సింగ్ పూర్తి చేయడంతో నర్సింగ్ ఉద్యోగానికి పరీక్ష రాసింది. ఇటీవల ప్రకటించిన ఫలితాల్లో ఉద్యోగం రాకపోవడంతో ఆమె మనస్తాపం చెంది ఈనెల 2న మధ్యాహ్నం ఇంట్లో గడ్డి మందు తాగింది. ఈ విషయం ప్రశాంతి తోటి ఉద్యోగికి చెప్పింది. వారు వెంటనే పట్టణంలోని ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు మెరుగైన చికిత్స కోసం ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా మంగళవారం మృతి చెందింది. మృతురాలి తమ్ముడు మోహన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఏ ఎన్నిక వచ్చినా కాంగ్రెస్‌దే విజయం

తిరుమలగిరి : కాంగ్రెస్ పార్టీ అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తోందని, పంచాయతీ నుంచి పార్లమెంటు వరకు ఏ ఎన్నిక వచ్చినా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులే విజయం సాధిస్తారని తుంగతుర్తి శాసన సభ్యుడు మందుల సామేల్ అన్నారు. మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తుంగతుర్తి నియోజకవర్గంలో గతంలో ఎన్నడూ లేని విధంగా కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డికి భారీ మెజార్టీ వచ్చిందని తెలిపారు. తుంగతుర్తి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలంగా ఉందన్నారు. భారీ మెజార్టీతో మరింత బాధ్యత పెరిగిందని అన్నారు. నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న సమస్యలన్నీ ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని తెలిపారు. త్వరలో జరిగే పంచాయతీ ఎన్నికల్లోనూ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు అత్యధిక మెజార్టీతో గెలుస్తారని అన్నారు.

మిర్యాలగూడలో కాంగ్రెస్ విజయోత్సవ ర్యాలీ



విజయోత్సవ ర్యాలీలో రఘువీర్‌రెడ్డి, ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ : నల్లగొండ ఎంపీగా కుందూరు రఘువీర్‌రెడ్డి 5,62,830 ఓట్ల మెజార్టీతో గెలుపొంది దేశంలోనే రెండో అత్యధిక మెజార్టీ సాధించిన అభ్యర్థిగా నిలిచారు. దీంతో మిర్యాలగూడ పట్టణంలోని రామచంద్రగూడెం నుంచి ఎన్‌ఎస్‌పీ క్యాంప్ వరకు భారీ విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కుందూరు రఘువీర్‌రెడ్డి మాట్లాడుతూ తన విజయం కోసం శ్రమించిన కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. భారీ మెజార్టీ ఇచ్చిన నల్లగొండ ప్రజలకు రుణపడి ఉంటానన్నారు. ఈ కార్యక్రమంలో సాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు గాయం ఉపేందర్‌రెడ్డి, నూకల వేణుగోపాల్‌రెడ్డి, నాయకులు తలకొప్పుల సైదులు, పాదిల శ్రీనివాస్, తమ్మడబోయిన అర్జున్, స్కైలాబ్ నాయక్, చలపతిరావు, జగ్గారెడ్డి, శంకర్‌రెడ్డి, ఇజ్రాయిల్ పాల్గొన్నారు.

గంగదేవమ్మ ఆలయాన్ని పరిశీలించిన క్లూస్ టీమ్

పెన్‌పహాడ్ : పెన్‌పహాడ్ మండల పరిధిలోని నాగులపహాడ్ గ్రామ మూసీ ఒడ్డున ఉన్న గంగదేవమ్మ ఆలయంలో రెండు రోజుల క్రితం చోరీ జరిగిన విషయం విధితమే. దీంతో మంగళవారం మండల పోలీసులు, సూర్యాపేట క్లూస్ టీమ్ పోలీసులు గంగదేవమ్మ ఆలయం ప్రాంగణాన్ని పరిశీలించారు. అనంతరం దేవాలయంలోని హుండీని, గేట్లను, దేవాలయం చుట్టూ ఉన్న ప్రాంతాలను పరిశీలించి, ఆధారాలను సేకరించారు. ఈ కార్యక్రమంలో మండల ఏఎస్‌ఐ వెంకటరత్నం, హెడ్ కానిస్టేబుల్ యాదగిరి, సతీష్, వెంకన్న, నరేందర్, కొండా జానకిరాములు, దేవయ్య, పుల్లయ్య, వెంకటేష్, కిరణ్, దాసరి లక్ష్మయ్య, సైదులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ నాయకుల సంబరాలు



నేరేడుచర్ల : నర్సయ్యగూడెంలో సంబరాలు జరుపుకుంటున్న కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు

నేరేడుచర్ల : కాంగ్రెస్ పార్టీ నల్లగొండ పార్లమెంటు అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డి భారీ మెజార్టీతో గెలుపొందడంపై హర్షం వ్యక్తం చేస్తూ మంగళవారం నేరేడుచర్లలో పార్టీ నాయకులు, కార్యకర్తలు సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా బాణసంచా కాల్చి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మలిగిరెడ్డి మల్లారెడ్డి, అలక శ్రవణ్‌రెడ్డి, శ్రీను, శ్యాంసుందర్ రెడ్డి, నాగార్జునరెడ్డి, వి.వెంకన్న, నవీన్, భిక్షం, రాంరెడ్డి, మల్లారెడ్డి, సంజీవరెడ్డి, వెంకన్న, నాగిరెడ్డి, బంగారయ్య, సైదిరెడ్డి తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్ గెలుపుపై హర్షం

నడిగూడెం : పార్లమెంటు ఎన్నికల్లో నల్లగొండ ఎంపీగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డి భారీ మెజార్టీతో గెలవడం పట్ల మంగళవారం స్థానిక జెడ్పీటీసీ సభ్యురాలు బాణాల కవిత హర్షం వ్యక్తం చేశారు. ఆయన గెలుపునకు కృషి చేసిన నాయకులు, కార్యకర్తలకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

కాంగ్రెస్‌కు అత్యధిక మెజార్టీ హర్షణీయం

గరిడేపల్లి : పార్లమెంటు ఎన్నికల్లో నల్లగొండ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కుందూరు అత్యధిక మెజార్టీతో గెలుపొందడం హర్షణీయమని పలువురు కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో వారు విలేకరులతో మాట్లాడారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ భారీ మెజార్టీ సాధించడం గొప్ప విషయమన్నారు. కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసిన కార్యకర్తలకు, ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. మండలంలోనూ కాంగ్రెస్‌కు అధిక మెజార్టీ రావడం సంతోషకరమన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు త్రిపురం అంజన్‌రెడ్డి, ఎంపీపీ పెండెం సుజాతాశ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎంపీపీలు పైడిమర్రి రంగనాథ్, కటికం ఆశారమేష్, గుండు రామాంజిగౌడ్, మూలగుండ్ల సీతారాంరెడ్డి, బచ్చలకూరి కృష్ణ, జుట్టుకొండ సత్యనారాయణ, బండా నర్సిరెడ్డి, మేకపోతుల అఖిల్‌గౌడ్, బాలూరి సందీప్, పాకాల పరమేష్, బారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మోతె మండలంలో 12 వేల మెజార్టీ

మోతె : పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మోతె మండలంలో 12 వేల ఓట్ల మెజార్టీ సాధించింది. కాంగ్రెస్ పార్టీ నల్లగొండ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డి అత్యధిక ఓట్ల మెజార్టీతో గెలుపొందడంతో మండలంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు సంబురాలు జరుపుకున్నారు.

కాపుగల్లులో సంబరాలు..

కోదాడరూరల్ : పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నల్లగొండ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డి భారీ మెజార్టీతో గెలుపొందడం పట్ల కోదాడ మండలంలోని కాపుగల్లు గ్రామంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా దివంగత మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షుడు కాసాని రామారావు, పంగులూరి రమేష్, ముత్తవరపు వీరయ్య, కాసాని వీరబాబు, తదితరులు పాల్గొన్నారు.

భార్గవ్ కుటుంబాన్ని ఆదుకోవాలి

అర్వపల్లి : అర్వపల్లికి చెందిన బైండ్ల యక్షగాన కళాకారుడు కడెం భార్గవ్ ఇటీవల మృతిచెందాడు. దీంతో అతడి కుటుంబం ఆర్థికంగా ఇబ్బందుల్లో పడింది. ఈ సందర్భంగా మంగళవారం పూలే, అంబేద్కర్ ఆశయ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఈదురు వీరపాపయ్య మాట్లాడుతూ భార్గవ్ కుటుంబాన్ని ఆదుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఎంతో కాలంగా భార్గవ్ కుటుంబం యక్షగానంపై ఆధారపడి జీవిస్తుందని చెప్పారు.

విద్యార్థులు తైక్వాండో నేర్చుకోవాలి

మిర్యాలగూడ : విద్యార్థులు చదువుతోపాటు తైక్వాండో(మార్షల్ ఆర్ట్స్) నేర్చుకోవాలని శాంతినికేతన్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ ప్రిన్సిపాల్ లీమా మేరీ అన్నారు. దామరచర్ల మండల కేంద్రంలోని శాంతినికేతన్ పాఠశాలలో గోలి రమేష్ ఆధ్వర్యంలో విద్యార్థులకు తైక్వాండోలో శిక్షణ ఇవ్వగా మంగళవారం విద్యార్థులకు కలర్ బెల్ట్ శిక్షణ ఇచ్చారు. అనంతరం పాఠశాల ప్రిన్సిపాల్ మేరీ, తెలంగాణ తైక్వాండో అసోసియేషన్ జనరల్ సెక్రటరీ ఎ.ప్రవీణ్‌కుమార్‌లు 25 మంది విద్యార్థులకు కలర్‌బెల్ట్స్, ప్రశంసాపత్రాలను అందజేశారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థుల ఆత్మరక్షణకు తైక్వాండో ఉపయోగపడుతుందన్నారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆర్‌ఎంపీ, పీఎంపీలపై దాడులు అరికట్టాలి



సమావేశంలో పాల్గొన్న ఆర్‌ఎంపీ, పీఎంపీలు

మునగాల : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మెడికల్ కౌన్సిల్‌ల ఆధ్వర్యంలో ఆర్‌ఎంపీ, పీఎంపీలపై నిర్వహిస్తున్న దాడులను అరికట్టాలని ఆర్‌ఎంపీ, పీఎంపీ మండల శాఖ అధ్యక్షుడు ఎరులక శ్రీశైలంగౌడ్ కోరారు. మంగళవారం మునగాలలో నిర్వహించిన ఆర్‌ఎంపీ, పీఎంపీల మండల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఆర్‌ఎంపీ, పీఎంపీలకు శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్లు జారీ చేస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా దాడులు నిలిపివేయాలని, లేనియెడల తాము రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు, ధర్నాలు చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో జిల్లా నాయకులు దొంతగాని రాంబాబు, మండల శాఖ ప్రధాన కార్యదర్శి ఉపేంద్రాచారి, ఆర్గనైజింగ్ సెక్రటరీ షేక్ ఖాదర్, వర్కింగ్ ప్రెసిడెంట్ మండవ శ్రీనివాస్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి సాయి, గౌరవ అధ్యక్షుడు రహీం, నాయకులు చెరుకు బాబు, ఆదినారాయణ, అనిల్‌కుమార్, రజనీకాంత్, కనకాచారి, పాషా, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

సత్తా చాటిన కాంగ్రెస్

సూర్యాపేట : నియోజకవర్గంలో గత పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల కంటే మెరుగైన ఓట్లు సాధించి కాంగ్రెస్ పార్టీ సత్తా చాటింది. నియోజకవర్గంలో 2019 పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 66.363 ఓట్లు, బీజేపీ కేవలం 6,263 ఓట్లు, సీపీఎం 3,706 ఓట్లు సాధించగా టీఆర్‌ఎస్ పార్టీ 77,862 ఓట్లతో మొదటి స్థానంలో నిలిచింది. ఇతరులకు 9,226 ఓట్లు వచ్చాయి. తదనంతరం 2023 డిసెంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 75,143 ఓట్లతో టీఆర్‌ఎస్ మొదటి స్థానం, 70,537 ఓట్లతో కాంగ్రెస్ రెండో స్థానం, 40,407 ఓట్లతో బీజేపీ మూడో స్థానంలో ఉన్నాయి. ప్రస్తుత పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 1,02,209 ఓట్లతో మొదటి స్థానం, 33,953 ఓట్లతో బీఆర్‌ఎస్ రెండో స్థానం, 31,397ఓట్లతో బీజేపీ మూడో స్థానంలో నిలిచాయి. అయితే కాంగ్రెస్ పార్టీ, బీజేపీలు గతంలో కన్నా తమ ఓటు బ్యాంకును భారీగా పెంచుకొని ఈ ఎన్నికల్లో సత్తా చాటాయి.

మునగాలలో కోతుల బెడద !

- జనాలను గాయపరుస్తున్న వానరాలు
- చిరువ్యాపారులకు సైతం తిప్పలు
- పట్టించుకోని పాలకవర్గం
- అడవులకు తరలించాలని వేడుకోలు



మునగాలలో వీధుల్లో సంచరిస్తున్న కోతులు

మునగాల : మునగాల మేజర్ గ్రామపంచాయతీ పరిధిలో కోతుల బెడద రోజురోజుకు పెరిగిపోతుంది. కోతులను నివారించేందుకు గ్రామపంచాయతీ ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కోతులు గుంపులుగుంపులుగా తిరుగుతూ ప్రజలపై దాడులు చేస్తున్నాయి. మహిళలు, చిన్నారుల చేతిలో ఉండే వాటిని లాక్కుంటున్నాయి. అడ్డుకునే ప్రయత్నం చేస్తే కరుస్తున్నాయి. రోడ్లపై దుకాణాలు పెట్టుకున్న చిరువ్యాపారులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. దుకాణాల్లో పండ్లు, కూరగాయలు ఇతర వస్తువులను ఎత్తుకెళ్తున్నాయి. తలుపులు తెరిచి ఉన్న ఇళ్లలోకి జొరబడి ఆహార పదార్థాలను ఎత్తుకెళుతున్నాయి. దీంతో ఇంట్లో ఎవరో ఒకరు కర్ర పట్టుకొని కాపాలా ఉండాల్సి వస్తోంది. అదేవిధంగా ఇళ్ల పైకప్పులను విప్పి కుప్పపెడుతున్నాయి. కోతుల బారినుంచి ఇళ్ల పైకప్పులను కాపాడుకునేందుకు కంప వేయాల్సి వస్తోందని ప్రజలు వాపోతున్నారు. ఇళ్లల్లో పండ్ల చెట్లు, పూలమొక్కలను నాశనం చేస్తున్నాయని చెబుతున్నారు. కోతుల భయంతో మహిళలు, పిల్లలు, వృద్ధులు వీధుల్లోకి రావాలంటేనే జంకుతున్నారు. ఇటీవల మునగాలలో కోతులు పలువురిని గాయపరిచిన సంఘటనలు కూడా ఉన్నాయి. కోతుల బారిన పడి పలువురు ఆస్పత్రుల్లో చికిత్స చేయించుకున్నారు. అయినప్పటికీ కోతులను పట్టుకునేందుకు పంచాయతీ పాలకవర్గం ఎటువంటి చర్యలు చేపట్టడం లేదు. ఇప్పటికైనా గ్రామపంచాయతీ పాలకవర్గం కోతుల బారినుంచి ప్రజలను కాపాడేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

కోతుల బారి నుంచి కాపాడాలి



"నేను మునగాలలో కూరగాయల వ్యాపారం నిర్వహిస్తున్నాను. నిత్యం కోతులు దుకాణంపై పడి కూరగాయలు ఎత్తుకెళ్తున్నాయి. కోతుల మూలంగా తీవ్రంగా నష్టం వాటిల్లుతోంది. కోతుల కోసం ప్రత్యేకంగా కాపాలా కాయాల్సి వస్తోంది. కోతుల బారి నుంచి కాపాడాలి.

– బొగ్గారపు చంద్రశేఖర్, మునగాల

గ్రామం నుంచి పారదోలాలి



"గ్రామంలో కోతుల బెడద ఎక్కువగా ఉంది. వీధుల్లోకి వెళ్లాలంటే భయంగా ఉంది. కోతులు ఆహారం కోసం మనుషుల మీద ఎగబడడమే గాక ఇళ్లల్లో దూరి ఆహార పదార్థాలు ఎత్తుకెళ్తున్నాయి. గ్రామపంచాయతీ పాలకవర్గం కోతులను గ్రామం నుంచి పారదోలేందుకు చర్యలు తీసుకోవాలి.

– కాసర్ల వెంకట్, మునగాల

ఇబ్బందులు పడుతున్నాం



"కోతుల వల్ల ఇబ్బందులు పడుతున్నాం. కోతులు ఆహారం దొరకని సమయంలో మనుషుల మీద ఎగబడి గాయపరుస్తున్నాయి. గ్రామంలో రోజుకో వీధి చొప్పున సంచరిస్తూ హల్‌చల్ సృష్టిస్తున్నాయి. కోతులను గ్రామం నుంచి పారదోలేందుకు ముందుకు రావాలి.

– తూముల వీరస్వామి, ఆలయ కమిటీ చైర్మన్, మునగాల